క్లుప్తంగా

హెచ్‌ఎంలకు ట్యాబ్‌ల అందజేత



హెచ్‌ఎంలకు ట్యాబ్‌లను అందిస్తున్న ఎంఈఓ

హిందూపురం టౌన్: స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ట్యాబ్‌లను ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ అందజేశారు. 1673 మంది 8వ తరగతి విద్యార్థులకు వాటిని పంపిణీ చేయాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు గ్రామంలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు. వారి వద్ద నుంచి 6,850 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నేటి నుంచి పరిగిలో మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

పరిగి: రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ తొలిసారిగా పరిగి మండల పర్యటనకు శనివారం వస్తున్నారు. మండలంలోని 14 పంచాయతీ గ్రామాల పరిధిలోని 45 గ్రామాల్లో నాలుగు రోజుల పాటూ సాగనున్న ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి మంత్రి విచ్చేయనున్నారు. మండలంలోని బీచిగానిపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో ఉదయం 8 గంటల నుంచి పర్యటన ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, మంత్రి కార్యాలయం వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. తొలిరోజు గొల్లపల్లి, బీచిగానిపల్లి, వంగలపల్లి, పాత్రగానిపల్లి, శీగిపల్లి, గణపతిపల్లి, పైడేటి, కొత్తపల్లి, పీ నరసాపురం, ముద్దిరెడ్డిపల్లి, బీరేపల్లి, ధనాపురం, శిరేకోళం గ్రామాల్లో పర్యటిస్తారన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రోహిల్ కుమార్

హిందూపురం టౌన్: పుట్టిన పిల్లల్లో వైకల్యతను గుర్తించి మెరుగైన చికిత్స అందించడం ద్వారా తల్లిదండ్రుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి ఊరట కల్పించాలని జిల్లా ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రోహిల్ కుమార్ మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులకు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డీఈఐసీ సెంటర్ పిల్లల వైద్యుడు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో ఆర్‌ఓపీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలకు, తక్కువ బరువు ఉన్న పిల్లలకు, పుట్టుకతో లోపాలు, వైకల్యతలను గుర్తించాలన్నారు. వారానికి ఒకరోజు ఆశా వర్కర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న డీఈఐసీ కేంద్రాన్ని సందర్శించి అందుతున్న సేవలపై వివరించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం పీఓ డాక్టర్ నివేదిత, ఆర్‌ఎంఓ రుక్మిణమ్మ, డాక్టర్ క్రాంతి కుమారి, డాక్టర్ అయిషా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. పట్టణ పరిధిలోని 33, 34వ వార్డులో కౌన్సిలర్ మణి ఆధ్వర్యంలో ధన్‌రోడ్డులోని కొత్తలమ్మ ఆలయం వద్ద, ముదిరెడ్డిపల్లి రోడ్డు నుంచి మేళాపురం వరకు సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణానికి దీపిక భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి

- మడకశిర వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప





మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డితో భేటీ అయిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప. మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడును కలిసిన ఈర లక్కప్ప

మడకశిర: మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని విజయపథంలో నడిపిస్తానని వైఎస్సార్‌సీపీ నూతన నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప తెలిపారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడుతూ నియోజకవర్గంలో అందరి సహకారంతో పని చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ముందుకెళ్తానని చెప్పారు. నియోజకవర్గ సమన్వయకర్తగా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. అతి సామాన్యుడైన తనను పార్టీ సమన్వయకర్తగా నియమించడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. పార్టీలో సామాజిక న్యాయానికి ఇదే గొప్ప నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని సందర్శించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మడకశిరలో పార్టీ జెండాను ఎగరవేసి సీఎంకు కానుకగా అందిస్తామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏ కష్టం వచ్చినా కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు.

అగళి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప శుక్రవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ , జేసీఎస్ కన్వీనర్ మహేంద్రప్ప, ఎంపీపీ రేణుక, కో ఆప్షన్ సభ్యుడు నాసిర్, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు, కార్యకర్తలను కలిశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు.

గుడిబండ: ప్రభుత్వ అభివృద్ధి , సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని ఫళారం గ్రామంలో ఉన్న దళితవాడలోని తన నివాసం సమీపంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నియోజకవర్గంలోని అన్నీ మండలాల ముఖ్యనేతలను కలిశారు. అనంతరం గుడిబండ, మడకశిర పట్టణాల్లోని మహానేత వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మడకశిర: వైఎస్సార్‌సీపీ నూతన సమన్వయకర్త ఈర లక్కప్ప శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో కూడా ఆయన పర్యటించారు. శుక్రవారం మడకశిరలో స్థానిక మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డిని కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన తన సంపూర్ణ మద్దతును ఈర లక్కప్పకు ప్రకటించారు. అలాగే కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రంగేగౌడ్, రవిశేఖర్‌రెడ్డి తదితరులను కూడా కలిశారు. అలాగే రొళ్లలో మాజీ మంత్రి నర్సేగౌడ్‌ను కలిసి ఆశీస్సులు పొందారు.

అమరాపురం: మండలంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప కలిశారు. ఈ సందర్భంగా ఈర లక్కప్ప మాట్లాడుతూ పార్టీ తనకు అవకాశం కల్పించిందని, తాను అన్ని వర్గాలను కలుపుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ వాగేష్, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయ, ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీ క్రిష్ణమూర్తి, ఎంపీటీసీలు నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులను కలసి మద్దతు కోరారు.

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌ఎం పల్లిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడును ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హెచ్‌బీ నర్సేగౌడు .. ఈర లక్కప్పను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈర లక్కప్ప మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు.

టీడీపీ నాయకుల ఆరోపణల్లో వాస్తవం లేదు

హిందూపురం: ఇటీవల పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఖలీల్ అనారోగ్యంతో చనిపోయారు. అయితే వైఎస్సార్‌సీపీ నాయకులు బాధిత కుటుంబానికి పట్టించుకోవడం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో కొందరు టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఖలీల్ సోదరుడు అజీజ్ తో పాటు కుటుంబ సభ్యులు తెలిపారు. తన తమ్ముడు ఖలీల్ చనిపోయిన రోజే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త జె.శాంతమ్మ తమ ఇంటికి వచ్చి ఖలీల్ పార్థివ దేహం వద్ద నివాళులర్పించి అంత్యక్రియలు పూర్తయ్యే వరకూ ఉన్నారన్నారు. కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి పెద్దారెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారన్నారు. అనవసరంగా కొంతమంది రాజకీయ, సొంత లబ్ధి కోసం ప్రకటనలు, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలకు తెర తీశారని విమర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిందూపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నారాయణస్వామి తెలిపారు. డీ1లోని 11కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా రహమత్‌పురం, నూర్‌కాలనీ, సిల్క్, సీపీఐ కాలనీ, ఆర్టీఓ ఆఫీసు పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు.

వ్యభిచార గృహ నిర్వాహకులకు రిమాండ్

పెనుకొండ: పట్టణంలో వ్యభిచార గృహాలు నడుపుతున్న ముగ్గురిని న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ రాజారమేష్ తెలిపారు. పట్టణంలోని నారాయణమ్మ కాలనీ, చింతతోపు ప్రాంతంలో కొందరు వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

రొద్దం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ శివారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కోగిర, కంబాలపల్లి గ్రామ పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహించారు. డీఎల్‌డీఓ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు ద్వారా ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కెనరా బ్యాంకు మేనేజర్ ప్రహ్లాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లలితమ్మ అధ్యక్షతన వీఓ లీడర్లు, వీఓఏల తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం తిప్పన్న, బ్యాంకు మేనేజర్‌లు మాట్లాడుతూ మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, ఉన్నతి, సీఐఎఫ్, శ్రీనిధి తదితర వాటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, సీసీలు, సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ చౌకబారు రాజకీయం

- 90 ఏళ్ల వృద్ధుడికి పింఛన్ ఇవ్వడం లేదని సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం
- తనకు ఠంచనుగా పింఛన్ అందుతోందని సదరు వృద్ధుడి వెల్లడి
- తప్పుడు పోస్టులపై ఫిర్యాదుకు సిద్ధమైన కౌన్సిలర్ సద్దాం



తనకు పింఛన్ వస్తోందని చెబుతున్న వృద్ధుడు రసూల్‌సాబ్



రసూల్ పింఛన్ కార్డు ఇదే

పెనుకొండ: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతూ టీడీపీ నాయకులు పైశాచికానందం పొందుతున్నారు. పట్టణంలోని కుమ్మరదొడ్డికి చెందిన 90 ఏళ్ల రసూల్‌సాబ్ కాలికి గాయం కావడంతో కట్టు కట్టించుకోవడానికి స్థానిక ప్రభుత్వాస్పత్రికి వెళ్లాడు. అదే సమయంలో ఎన్‌టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని రోగులకు పాలు బ్రెడ్లు పంపిణీ చేయడానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే బీకే.పార్థసారథి, ఆయన అనుచరులు రసూల్‌సాబ్ పలకరించారు. పాలు, బ్రెడ్లు అందించి ఫొటో కూడా దిగారు. కొంతసేపటి తర్వాత వయో వృద్ధుడైన రసూల్‌సాబ్‌కు ఫించన్ రాలేదంటూ సామాజిక మాధ్యమాల్లో అతని ఫొటోను పెట్టి వైరల్ చేశారు. ఈ ఘటనపై పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ సద్దాం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఇలాంటి చౌకబారు, దిగజారుడు రాజకీయాలు చేయడం దారుణమన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తోందన్నారు. తన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన విషయం తెలుసుకున్న రసూల్ సాబ్ సైతం టీడీపీ నాయకుల తీరుపై విచారం వ్యక్తం చేశారు. తనకు ఠంచనుగా పింఛన్ వస్తోందని స్పష్టం చేశారు. అనవసరంగా పింఛన్ రాలేదని పోస్టులు పెట్టడం సరికాదన్నారు. కాగా.. తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు కౌన్సిలర్ సద్దాం తెలిపారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: కులమతాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. శుక్రవారం హిందూపురం మున్సిపాల్టీ పరిధిలోని 1వ వార్డు సచివాలయ పరిధిలో కౌన్సిలర్ మల్లికార్జునతో కలసి టీఎన్ దీపిక గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ పేదలకు ఏ ప్రభుత్వం ఇంతవరకూ చేయలేనంత మంచిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తోందన్నారు. సంక్షేమ లబ్ధి నేరుగా ప్రజల వద్దకే చేరుతున్నాయన్నారు. పేదల పక్షాన నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇతర పార్టీలతో కలిసి ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఏడాది ఒకసారి అలా ఇచ్చి ఇలా వెళ్లే ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం అభివృద్ధికి చేసిందేమీలేదన్నారు. వచ్చిన ప్రతిసారీ ఊరేగింపులు, హంగామాలు చేయడం తప్ప ప్రజల గురించి ఏరోజూ ఆయన పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫిర్దోస్, వైస్ చైర్మన్ మహేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కాణిపాకం టెంపుల్ డైరెక్టర్ రవీంద్రుడు, కౌన్సిలర్లు షాజియా, మణి, గిరి, పార్వతీ, నాగేంద్రమ్మ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఫరూఖ్, జేసీఎస్ కన్వీనర్ శివ శంకర్‌రెడ్డి, పట్టణ మైనారిటీ ఏ,బీ,బ్లాక్ కన్వీనర్లు అయూబ్ బేగ్, భాను, వార్డు ఇన్‌చార్జ్‌లు చాంద్‌బాషా, నారాయణస్వామి, నాయకులు మల్లికాబాను, రవీంద్రరెడ్డి, వివేకానందరెడ్డి, ఆనంద్‌రెడ్డి, మస్తాన్, ముజీబ్, జబీ, కృష్ణారెడ్డి, శీను తదితరులు పాల్గొన్నారు.

జోరుగా 'ఆడుదాం ఆంధ్రా'



లేపాక్షి: మండలస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన కొండూరు జట్టు



గుడిబండ: మండలస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన దేవరహట్టి జట్టు

రొళ్ల: 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి వాలీబాల్, క్రికెట్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. వాలీబాల్‌లో ఎం.రాయాపురం విజేతగా, సచివాలయం జట్టు రన్నరప్‌గా నిలిచాయి. అలాగే క్రికెట్ పోటీల్లో రాయపురం జట్టు విజేతగా, రొళ్ల-1 సచివాలయ జట్టు రన్నరప్‌గా నిలిచింది. కబడ్డీ పోటీల్లో రత్నగిరి జట్టు విజేతగా, హులికుంట జట్టు రన్నరప్‌గా నిలిచాయి. వాలీబాల్ బాలికల విభాగంలో ఏ సచివాలయం జట్టు పోటీలో లేకపోవడంతో ఎం.రాయాపురం జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంది. ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ క్రిష్ణప్ప తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

లేపాక్షి: లేపాక్షిలోని ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండలస్థాయి టోర్నమెంటులో కొండూరు టీం విజేతగా నిలిచింది. క్రికెట్ పోటీల్లో కొండూరు – లేపాక్షి-3 జట్లు తలపడ్డాయి. కొండూరు విజేతగా, లేపాక్షి-3 రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ పోటీల్లో కొండూరు విజేతగా, శిరివరం రన్నరప్‌గా నిలిచాయి. ఎంపీడీఓ నరసింహ నాయుడు, ఈఓఆర్డీ శివన్న, జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివకుమార్, మండల కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని ముద్దనకుంట క్రీడా మైదానంలో శుక్రవారం మండలస్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలను పీఈటీ సాయిక్రిష్ణ ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో దేవరహట్టి, కొంకల్లు జట్లు తలపడగా దేవరహట్టి టీమ్ విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టును పీఈటీ కొండప్ప, సచివాలయ సిబ్బంది అభినందించారు.

యువకుడికి తీవ్రగాయాలు

పావగడ: పట్టణంలోని శిరా రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక సీనియర్ కాంగ్రెస్ నేత మానం వెంకటస్వామి కుమారుడు రంజిత్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. రంజిత్‌కుమార్ శిరా రోడ్డులో ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ముందుగా వెళ్తున్న బొలెరో వాహన డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుకనే ఉన్న రంజిత్ బైక్ అదుపు తప్పింది. తీవ్రంగా గాయపడిన రంజిత్‌ను బెంగళూరుకు తరలించారు. ప్రస్తుతం అదను కోలుకుంటున్నట్లు మానం వెంకటస్వామి తెలిపారు.

ఇద్దరికి గాయాలు

లేపాక్షి: లేపాక్షి పరిధిలోని గలిబిపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిలో శుక్రవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. మల్లిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిప్పన్న (70) లేపాక్షి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. అలాగే చిలమత్తూరు మండలం ముద్దపల్లికి చెందిన గణేష్ అటు వైపు నుంచి వస్తున్నారు. గలిబిపల్లి క్రాస్ వద్ద రెండు వాహనాలు ఢీ కొన్నాయి. తిప్పన్నకు కాలు విరిగింది. గణేష్‌కు రెండు కాళ్లకు గాయాలయ్యాయి. ఇద్దరిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

యోగి వేమన ఆశయ సాధనకు కృషి



మడకశిర: వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు



హిందూపురం: రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో కిరికెర సడ్లపల్లి కూడలిలో వేమన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

మడకశిర: విశ్వకవి యోగి వేమన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని రెడ్డి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని అదిరెడ్డి పాళ్యంలో యోగి వేమన జయంతి వేడుకలను శుక్రవారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేమన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమిదాలగొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, రామిరెడ్డి, ఆనందరంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పావగడ: యోగి వేమన రచించిన శతకాలు నిత్య జీవన సత్యాలని, అన్ని కాలాలు అందరికీ బతుకు దారి చూపించే మార్గ దర్శకాలని స్థానిక తాలూకా రెడ్డి జన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక తాలూకా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన యోగి వేమన జయంతి వేడుకల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రెడ్డి జన సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను విడుదల చేశారు. లాయర్ వెంకట్రామిరెడ్డి, నాగార్జున రెడ్డి, నరసింహారెడ్డి, చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: తెలుగువారి చరిత్ర, సంస్కృతి సాహిత్యాలలో విశిష్ట స్థానం కలిగిన మహనీయుడు యోగివేమన అని వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి కొనియాడారు. శుక్రవారం రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో వేమన జయంతి వేడుకలు కిరికెర సడ్లపల్లి కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి, కౌన్సిలర్ సునీత రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, నారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, డాక్టర్ అశ్వర్థరెడ్డి, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: యోగి వేమన తన పద్యాలతో ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని నింపారని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. యోగివేమన జయంతి సందర్భంగా కొట్నూరులో వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జునగౌడ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మహేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అశ్వత్‌రెడ్డి, వివేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని రెడ్డి జేఏసీ కార్యాలయం నందు శుక్రవారం ఉదయం రెడ్డి సోదరులు ప్రజాకవి యోగి వేయన జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యోగి వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లును పంచుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రెడ్డి సంఘం నాయకుడు అంజినరెడ్డి మాట్లాడుతు అంధకారంలో ఉన్న ప్రజా బాహుళ్యాన్ని జాగృత పరిచి సమాజ హితం కొరకు జ్ఞానాన్ని పంచిన వ్యక్తి యోగి వేమన అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జేఏసి నాయకులు పాల్గొన్నారు

కుల గణన ప్రారంభం



రొద్దం మండలం తురకలాపట్నంలో కులగణన పరిశీలిస్తున్న నోడల్ అధికారి శివారెడ్డి



రొళ్ల మండలం బీజీ హళ్లిలో సర్వే చేస్తున్న సచివాలయం సిబ్బంది



పరిగి: కులగణన సర్వేపై సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ సరస్వతి



మడకశిర మండలం సీ కొడిగేపల్లిలో కులగణన సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కుల గణన సర్వేను మండలంలో పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ సరస్వతి సిబ్బందిని ఆదేశించారు. కులగణన ప్రక్రియ ప్రారంభం సందర్భంగా తొలి రోజు మండలంలో పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ ఈనెల 28 వరకూ ఈ సర్వే కొనసాగుతుందన్నారు. హౌసింగ్ ఏఈ సునీత, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రొద్దం: సమాజంలో అణగరిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని అందులో భాగంగా నేటి నుంచి ఈనెల 28 వరకూ కులగణన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో నారనాగేపల్లి, కోగిర, తురకలాపట్నం గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న కులగణన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, సచివాయల సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

రొళ్ల: కులగణన సర్వేను సచివాలయం సిబ్బంది, వలంటీర్లు వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఆజాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా 11 సచివాలయం పరిధిలోని వివిధ గ్రామాల్లో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు సంయుక్తంగా కలిసి ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆర్థిక స్థితిగతుల పై సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రామాంజినేయులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో అధికారులు, వలంటీర్లు సంయుక్తంగా కుల గణన సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కుటుంబ యాజమాని నుంచి ఏ కులం? ఇంటిలో ఎంతమంది సభ్యులు ఉన్నారు? తదితర వివరాలన సేకరించారు. ఈఓఆర్డీ నాగముని , సచివాలయం కార్యదర్శులు పర్యవేక్షించారు.

మడకశిరరూరల్: మండలంలోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ఇంటింటా కుల గణన సర్వేను ప్రారంభించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. ప్రజలకు సంతృప్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందించడానికి ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.